## పాఠము-7

# కష్టనష్టాల విముక్తికి తాయత్తులు, దారాలు, రక్షరేకులు ధరించుట

అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఈ విధముగా సంబోధించెను.

قُلْ أَفَرَءَيْتُم مَّا تَدْعُونَ مِن دُونِ ٱللَّهِ إِنْ أَرَادَنِىَ ٱللَّهُ
بِضُرٍّ هَلْ هُنَّ كَـٰشِفَـٰتُ ضُرِّهِۦٓ أَوْ أَرَادَنِى بِرَحْمَةٍ هَلْ هُنَّ
مُمْسِكَـٰتُ رَحْمَتِهِۦ ۚ قُلْ حَسْبِىَ ٱللَّهُ ۖ عَلَيْهِ يَتَوَكَّلُ ٱلْمُتَوَكِّلُونَ ﴿٣٨﴾

**"ఓ ప్రవక్తా! వారిని ఉద్దేశించి పలుకుము. ఒకవేళ అల్లాహ్ నన్ను దండించదలచిన ఎడల అల్లాహ్‌ని కాదని మీరెవరినైతే ఆరాధిస్తున్నారో వారు నన్ను రక్షించగలరా? లేదా అల్లాహ్ నన్ను కరుణించదలచినచో వీరు అల్లాహ్ కరుణను అడ్డుకొనగలరా? మీరే ఆలోచించండి. నాకు అల్లాహ్ ఒక్కడే చాలని చెప్పండి, నమ్ముకునే వారు ఆయన్నే నమ్ముకుంటారు."**

***(అజ్-జుమర్-39:38)***

హజరత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ రజి అల్లాహు అన్హు ఈ విధముగా ఉల్లేఖించెను: "ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఒక వ్యక్తి తన చేతిలో ఇత్తడి కడియాన్ని తొడిగి ఉండటం చూసి, ఇది ఏమిటని ప్రశ్నించెను. ఆ వ్యక్తి ఇది 'వాహినా' (బలహీనత) కారణముగా తొడిగితిని అని జవాబు పలికెను. అప్పుడు ప్రవక్త(సఅసం) దీనిని తీసివేయి. అది(నీకు ఏమీ లాభము చేకూర్చదు) నిన్ను ఇంకా బలహీనపరుస్తుంది. అది తొడిగి ఉండగా నీకు మరణము సంభవిస్తే నీవు మోక్షము పొందలేవు" అని అన్నారు.

*(ముస్నద్ అహ్మద్-సహీసనద్)*

హజరత్ ఉఖ్బా బిన్ ఆమిర్ రజి అల్లాహు అన్హు ఈ విధముగా ఉల్లేఖించారు: ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఈ విధముగా

ప్రబోధించారు: "తాయత్తులు ధరించే వారి కార్యములను అల్లాహ్ పూర్తి చేయకుండుగాక! గవ్వలు వ్రేలాడదీసే వారికి అల్లాహ్ శాంతినివ్వకుండుగాక! (ముస్నద్ అహ్మద్)

"తాయత్తులు వ్రేలాడదీసే వారు అల్లాహ్‌కు భాగస్వామ్యాన్ని కల్పించిన వారే." (ముస్నద్ అహ్మద్)

ఇబ్నె అబీ హాతిం హజరత్ హుజైఫా రజి అల్లాహు అన్హు గురించి ఈ విధముగా ఉల్లేఖించెను: ఆయన ఒక వ్యక్తి చేతికి అనారోగ్య కారణంగా తాడు కట్టబడి ఉండుట చూచెను. ఆయన దానిని త్రెంచి వేసి ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్ పఠించెను.

وَمَا يُؤْمِنُ أَكْثَرُهُمْ بِاللَّهِ إِلَّا وَهُمْ مُشْرِكُونَ ﴿١٠٦﴾

**"అల్లాహ్‌ని విశ్వసించిన వారిలోని అధికులు భాగస్వాములను కూడా కల్పిస్తూ ఉంటారు."** ***(యూసుఫ్-12:106)***

## దీనిలో 11 అర్థ తాత్పర్యములు కలవు

1. తాయత్తులు లేదా ఏవైనా వస్తువులు ధరించుట నిషిద్ధము.
2. ప్రవక్త సహచరుడైనా తాయత్తులు ధరించి మరణించిన ఎడల మోక్షము పొందలేరు. " చిన్న తరగతి షిర్క్ ఘోరపాపాల కన్నా అతిఘోరమైనది" అన్న దైవప్రవక్త సహచరుల మాటకు ఈ హదీసు సాక్ష్యం (సమర్థన) లభిస్తోంది.
3. తెలియక చేసినప్పటికీ మోక్షము లభించదు.
4. ఈ వస్తువులు ఇహలోకములో కూడా లాభదాయకంకావు. పైగా నష్టం కలిగిస్తాయి. ఎందుకంటే దైవప్రవక్త(స)"అది నిన్ను ఇంకా బలహీన పరుస్తుంది" అన్నారు.
5. ఇలాంటి వక్ర ఆచరణలు చేయువానిని గట్టిగా వారించవలెను.
6. ఎవరైతే ఏ వస్తువు వ్రేలాడదీయునో దానికి అప్పజెప్పబడును.

7. తాయత్తులు ధరించేవారు అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పించినవారే.

8. జ్వరం వచ్చినా తాళ్ళు కట్టుట నిషిద్ధం.

9. హజరత్ హుజైఫా రజి అల్లాహు అన్హు యొక్క వచనం ప్రకారం- 'షిర్కె అక్బర్'కు సంబంధించిన ఆయతు 'షిర్కె అస్గర్'కి కూడా వర్తించును.

10. దిష్టి నుండి కాపాడబడుటకు గవ్వలను తొడుగుట అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించినట్లు.

11. తాయత్తులు మరియు గవ్వలు తొడుగు వానిని శపించవచ్చును. తాయెత్తులు ధరించేవారి కార్యములను అల్లాహ్ పూర్తిచేయడు. గవ్వలు ధరించేవారిని అల్లాహ్ వారిమానాన వదిలేస్తాడు. (అంటే వారికి ఉపశమనం లభించదు).